క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గానికి ఎన్నిక పత్రాలు అందజేస్తున్న అధికారి శాలిని

మొయినాబాద్: మండల పరిధిలోని పెద్దమంగళారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. మత్స్యశాఖ అధికారిణి శాలిని ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా పొన్న ప్రభాకర్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా మేకగూడెం మల్లేశ్‌ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా మేకగూడెం శ్రీనివాస్‌ముదిరాజ్, కోశాధికారిగా అనిమోని నాగభూషణం, కార్యవర్గ సభ్యులుగా నర్సింహ్మముదిరాజ్, పొన్న సుదర్శన్ ముదిరాజ్, మేకగూడెం నరేంద్ర ముదిరాజ్, మేకగూడెం నర్సింహ్మముదిరాజ్, నరేందర్ ముదిరాజ్‌లను ఎన్నుకున్నారు. ఈ మేరకు ఎన్నికైన వారికి నియామక పత్రాలను శాలిని అందజేశారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి



అవినాశ్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

షాబాద్: ఆలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న ఆలయానికి తన వంతు సహాయంగా రూ.3లక్షల విరాళం అందజేశారు. అనంతరం జెడ్పీటీసీని గ్రామస్తులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. పురాతన ఆలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్న నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ సులోచనశేఖర్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, విఠలయ్య, గోపాల్, గ్రామస్తులు తదితరులున్నారు.

అనుసూజ కుటుంబాన్ని ఆదుకోవాలి

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేట ప్రభుత్వ పాఠశాలలో అనుసూజ మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీగా పని చేస్తూ బుధవారం రాత్రి గుండెపోటుకు గురై ఆకస్మికంగా మృతి చెందింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య గురువారం ఆమె కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనుసూజ 13 ఏళ్లుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తూ సేవలందించారని, ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆమెకు రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు.

ఓటు.. వజ్రాయుధం

ఏపీఎం శ్రీదేవి

తలకొండపల్లి: ఓటు అనేది వజ్రాయుధం వంటిదని ఏపీఎం శ్రీదేవి అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం ఏపీఎం ఆధ్వర్యంలో సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరియల్ పార్టిసిపేషన్ కార్యక్రమంపై మహిళా గ్రూప్ అధ్యక్షురాలు, సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటు ప్రాముఖ్యత వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏపీఎం మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా మండల సమాఖ్య అధ్యక్షురాలు మహేశ్వరి, సీసీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు సాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని చంద్రధన గ్రామంలో మార్చి 26న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాస్‌రెడ్డిని ఆర్థిక సహాయం చేయాలని కోరారు. దీంతో స్పందించిన ఆయన గురువారం రూ.10వేలు సాయం చేశారు. కార్యక్రమంలో గణేశ్, రమేశ్, సంతోశ్, మల్లేశ్, సుధాకర్, ప్రవీణ్, కుమార్ పాల్గొన్నారు.

రసవత్తరంగా ఎమ్మెల్సీ ఉపపోరు!

క్యాంపు రాజకీయాలు షురూ

- కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల వ్యూహ ప్రతివ్యూహాలు
- గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్
- ఈనెల 28న పోలింగ్, ఏప్రిల్ 2న కౌంటింగ్

షాద్‌నగర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు రసవత్తరంగా మారాయి. ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు వ్యూహ, ప్రతివ్యూహాలు పన్నుతున్నారు. పోలింగ్‌కు వారం రోజుల గడువు మాత్రమే ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు నేతలను క్యాంపులకు తరలించడం ప్రారంభమైంది.

ఆపరేషన్ ఆకర్ష్

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ నుంచి పారిశ్రామికవేత్త మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్‌గౌడ్‌లు బరిలో ఉన్నారు. అయితే ఈ ఉప ఎన్నికలో ఎలాగైనా విజయం సాధించాలని కాంగ్రెస్ పార్టీ పట్టుదలతో ఉండగా, బీఆర్ఎస్ పార్టీ తన నేతలను కాపాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చాలా మంది బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన వారు అధికంగా ఉండటంతో కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌ను చేపట్టింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లను కాంగ్రెస్ పార్టీ నేతలు తమ పార్టీలో చేర్చుకుంటున్నారు. దీంతో ఉపఎన్నిక పోరు రసవత్తరంగా మారింది. నేతలు ఎప్పుడు ఏ పార్టీ మారుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ప్రధాన పార్టీల వారు ఉప ఎన్నికల్లో తమదే గెలుపు అని ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

క్యాంపులకు తరలివెళ్తున్న నాయకులు

ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఈ నెల 28న జరగనుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు కౌన్సిలర్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలను క్యాంపులకు తరలిస్తున్నారు. షాద్‌నగర్ నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులు నాయకులకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి క్యాంపులకు తరలిస్తున్నారు. ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు నాయకులను గోవా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు క్యాంపులకు విడతల వారీగా తరలిస్తున్నారు. క్యాంపులకు తరలివెళ్లే వారిని ఓ కంటకనిపెడుతూ ఇతర పార్టీల నేతల వలలో పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం



క్యాంపులకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు



కాంగ్రెస్ పార్టీలో చేరిన నిర్దవెల్లి ఎంపీటీసీ కిష్టమ్మ

షాద్‌నగర్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వాహణకు ఎన్నికల సంఘం అధికారులు షాద్‌నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రంలో షాద్‌నగర్‌తో పాటు ఆమనగల్ పరిధిలోని మొత్తం మూడు మున్సిపాలిటీలు, పది మండలాలకు చెందిన కౌన్సిలర్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలు మొత్తం 171 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ నెల 28న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుండగా, ఏప్రిల్ 2న కౌంటింగ్ నిర్వహిస్తారు.

మొదటి ప్రాధాన్యత ఓటుకే..

ఎమ్మెల్సీ ఉప పోరులో ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు, రెండో ప్రాధాన్యత ఓటు, మూడో ప్రాధాన్యత ఓటు ఉంటుంది. మొత్తం పోలైన ఓట్లలో సగం కంటే ఒకటి అదనంగా ఎక్కువగా మొదటి ప్రాధాన్యత ఓటు వస్తే ఆ అభ్యర్థి మొదటి రౌండ్‌లోనే విజయం సాధిస్తారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో పోలైన వాటిలో సగం కంటే తక్కువగా వస్తే రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఇందులో ఎవరికి సగానికిపైగా ఓట్లు వస్తే వారు విజయం సాధిస్తారు. ఉప ఎన్నిక పోరులో జిల్లాలో మొత్తం 1439 ఓట్లు ఉన్నాయి. అన్ని ఓట్లు పోలైతే మొదటి ప్రాధాన్యత ఓటర్లతో గెలవాలంటే కనీసం ఆ అభ్యర్థికి 721 ఓట్లు రావాల్సి ఉంటుంది. బరిలో ఉన్న అభ్యర్థులు తమ ప్రచారంలో భాగంగా మొదటి ప్రాధాన్యత ఓటు మాత్రమే వేయాలని అభ్యర్థిస్తున్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



వారోత్సవాల్లో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు

సూపర్‌వైజర్ అనురాధ

చేవెళ్ల: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. మండలంలోని దామరగిద్ద గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే పుట్టబోయే బిడ్డ క్షేమంగా ఉంటారని చెప్పారు. గుండ్లు, మాంసం, చేపలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుజాత, గర్భిణులు, మహిళలు, గ్రామస్తులతో పాటు కమ్మెట సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి

షాబాద్: పశు పోషకులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని పోతుగల్, నరెడ్లగూడ గ్రామాల్లో పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 30వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేసి టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువులకు గర్భకోశ వ్యాధులు రాకుండా ఉండాలంటే గాలికుంటు టీకాలు తప్పకుండా వేయించాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్యసిబ్బంది శ్రీను, బాలరామ్, బాలరాజ్, కృష్ణ, శ్రీకాంత్, రాణి, రైతులు తదితరులున్నారు.



పోతుగల్‌లో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

వెంకటస్వామి ఆశయాలను కొనసాగిద్దాం

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప

షాద్‌నగర్‌రూరల్: తన జీవితాన్ని ఉపాధ్యాయ ఉద్యమానికి అంకితం చేసిన యూటీఎఫ్ నాయకుడు అప్పారి వెంకటస్వామి ఆశయాలను కొనసాగిద్దామని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప అన్నారు. పట్టణంలోని ఎమ్మార్సీ భవనంలో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం అప్పారి వెంకటస్వామి వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై అప్పారి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటప్ప మాట్లాడుతూ.. నేటి తరానికి వెంకటస్వామి ఎంతో ఆదర్శనీయులన్నారు. వేసవి సెలవులు ముగిసేవరకు ఉపాధ్యాయ బదిలీలను చేపట్టాలని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా క్యాదర్శులు శివారెడ్డి, నర్సింలుగౌడ్, నాయకులు కృష్ణయ్య, బాలయ్య, చంద్రశేఖర్, శేఖర్‌గౌడ్, కృష్ణ, నర్సింలు, సమత, అరుణ, కవిత, శివలీల, సుభాషిణి, కల్యాణి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, సురేందర్, వేణు, శ్యామాచారి, రాములు తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కేశంపేట: టీఎస్‌యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి వర్ధంతిని మండల కేంద్రంలో ఉపాధ్యాయులు నిర్వహించారు. యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మండల విద్యాధికారి కార్యాలయంలో వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్షుడు రాంమోహన్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఉపాధ్యాయులు ఆనంద్‌కుమార్, ప్రకాశ్, కృష్ణయ్య, చిన్నరావు, అప్పారావు, నారాయణరావు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం

అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మొయినాబాద్: రక్తదానం చేయడం ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ప్రాణదానం చేయడమేనని అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాల, కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ క్యాపిటల్‌ల ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నిత్యం ఎన్నో ప్రమాదాలు జరిగి సమయానికి రక్తం అందక ఎంతో మంది చనిపోతున్నారని.. రక్తదానం చేయడంతో అలాంటి వారి ప్రాణాలను కాపాడగలమన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని చెప్పారు. ఈ సందర్భంగా 72 యూనిట్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కేజీరెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, ఉదయశ్రీ, ఎన్ఎస్ఎస్ పీఓలు మల్లారెడ్డి, రమేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ మండల కమిటీల ఎంపిక



నూతన కమిటీ సభ్యులు

కొందుర్గు: ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ రాకేశ్ ఆధ్వర్యంలో గురువారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలకు సంబంధించిన పార్టీ మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొందుర్గు మండల కమిటీ అధ్యక్షుడిగా డప్పు రవీందర్, కో–కన్వీనర్లుగా రాములు, విజయ్, శివ, కోశాధికారిగా సంజీవ, మీడియా ఇన్‌చార్జిగా రమేశ్ ఎన్నికయ్యారు. అదేవిధంగా జిల్లేడ్ చౌదరిగూడ మండల కన్వీనర్‌గా చెనగళ్ల గిరి, కో–కన్వీనర్‌గా నర్సింహ, మీడియా ఇన్‌చార్జిగా శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర నాయకుడు భిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అణగారిన వర్గాలు అభివృద్ధి చెందాలంటే ధర్మ సమాజ్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, శ్రీను, సాయిలు, సత్యం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం కొందుర్గు మండలానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ నేత సయ్యద్ సాధిక్, నాయకులు భీమిడి అశోక్‌రెడ్డిలతో పాటు సుమారు 500 మంది శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు పార్టీలోని చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి చాలా మంది నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. బీఆర్ఎస్, బీజేపీలను ప్రజలను నమ్మడం లేదన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు విశ్వసించడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. ఎంపీ ఎన్నికల్లో చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, బాబర్‌ఖాన్, రఘు, పురుషోత్తంరెడ్డి, ఖాదర్‌గోరీ, శివశంకర్‌గౌడ్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సయ్యద్ సాదిక్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ముమ్మరంగా వాహనాల తనిఖీ

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ సందర్భంగా పోలీసులు వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. గురువారం షాద్‌నగర్ పరిధిలోని రాయికల్ టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారిపై పట్టణ సీఐ ప్రతాప్‌లింగం ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహనాల్లో అక్రమంగా నగదు, బంగారం, వెండి ఆభరణాలు, మద్యం రవాణా చేయడం నేరమన్నారు. అక్రమ రవాణా చేస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. నగదు, నగలను వాహనాల్లో రవాణా చేయాల్సి వస్తే దానికి సంబంధించిన పూర్తి ఆధారాలను చూపించాలని సూచించారు. లేని పక్షంలో వాటిని సీజ్‌చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల నేపథ్యంలో పటిష్టమైన నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక పోలీస్ బృందాలను నియమించి తనిఖీలను చేపడుతున్నట్లు తెలిపారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

దేశరక్షణకు పాటుపడే నాయకుడు అవసరం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: దేశ రక్షణకోసం నిరంతరం పాటుపడే నాయకుడు శక్తివంతమైన వ్యక్తి దేశ ప్రధానిగా ఉండటం ఎంతో అవసరమని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శంకర్‌పల్లి మండలంలోని సంకేపల్లి గ్రామంలో గురువారం విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కెఎస్. రత్నంల సమక్షంలో పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రాబోయేది బీజేపీ ప్రభుత్వమేని ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి అత్యధిక మెజార్టీని అందించి చేవెళ్ల ఎంపీ సీటును కానుకగా అందిద్దామని చెప్పారు. ప్రజల కోసం నిరంతరం పనిచేసే వ్యక్తులనే ఎన్నికోవాలన్నారు. బీజేపీకి ఓటు వేసి ఎంపీగా తనకు ప్రధానిగా మోదీకి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కన్వీనర్ సింగపురం రమేశ్, అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, సంకేపల్లి మాజీ సర్పంచ్ పరమేశ్వర్‌రెడ్డి, నాయకులు కాలయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాములుగౌడ్, వైభవ్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు తమ వంతు ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం మండల పరిధిలోని ఎలికట్ట గ్రామ మాజీ సర్పంచ్ సాయిప్రసాద్‌యాదవ్ రూ.25వేల విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కక్కునూరి వెంకటేశ్‌గుప్తాకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని వెంకటేష్‌గుప్తా అన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకొని ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు.



విరాళం అందజేస్తున్న సాయిప్రసాద్‌యాదవ్

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయం

కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కల్వ సుజాత

షాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఆర్యవైశ్యుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఆమె నివాసంలో మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల చిరకాల కోరిక వైశ్య కార్పొరేషన్‌తో నెరవేరిందన్నారు. ఆర్యవైశ్యుల్లో ధనవంతులే కాదు. పేదలు కూడా ఉన్నారని, కార్పొరేషన్‌తో అందరికి లబ్ధి చేకూరుతోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వంద రోజుల్లోనే కార్పొరేషన్ ఏర్పాటు చేసి కీలక ప్రకటన చేయడం ఎంతో హర్షణీయమన్నారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తాన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్‌గుప్తా, పూర్ణచందర్‌గుప్తా, అశోక్‌గుప్తా, నవీన్‌గుప్తా, దయానంద్‌గౌడ్ తదితరులున్నారు.



సుజాతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

పరిశోధనాత్మక విద్యకు అధిక ప్రాధాన్యం

డీఆర్‌డీఎల్ డైరెక్టర్ ప్రఖ్యాత శాస్త్రవేత్త బాలమురళీకృష్ణన్

ఇబ్రహీంపట్నం రూరల్: సాంకేతిక విద్యనభ్యసించే విద్యార్థులు పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యతనిస్తే మంచి ప్రయోజకులవుతారని డీఆర్‌డీఎల్ డైరెక్టర్ ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ బాలమురళీకృష్ణన్ పేర్కొన్నారు. మంగళ్‌పల్లి సమీపంలో గల సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరగబోయే సీఎస్‌షియా–2024 పేరుతో సాంకేతిక సంబరాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కళాశాల చైర్మన్ రాఘవ చెరబుడ్డితో కలిసి బాలమురళీకృష్ణ జ్యోతి ప్రజ్వాలన చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కాసా రామ్మోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్కం శివారెడ్డి పాల్గొన్నారు.